సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 02 | సంచిక : 67 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 27.06.2025

మత్తు వీడాలి

- డ్రగ్స్ రహిత సమాజానికి యువత ఉద్యమించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2 పేజీ

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

కార్పొరేట్ల చేతుల్లో
మోడీ స్టీరింగ్
4

దేశ వ్యాప్త సమ్మెను
సక్సెస్ చేయాలి
2

సీనియర్ జర్నలిస్ట్‌కు
ఎన్టీఆర్ అవార్డు
4

దేశ వ్యాప్త సమ్మెను సక్సెస్ చేయాలి

వరంగల్, మన చౌరాస్తా : జులై 09న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిర్వహించే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అల్లం అప్పయ్యకు ఈ మేరకు గురువారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్(ఎన్. హెచ్ ఎం) లో 78 రకాల క్యాడర్స్ లో పనిచేస్తున్నారని వారందరికీ ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ఉద్యోగులకు కనీస వేతనం 26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక, ఉద్యోగుల సమస్యల పైన శాశ్వత పరిష్కారం కోసం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి మియాపురం గోవర్ధన్ , యోగానంద చారి పరికిరాల రమేష్ , జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విష్ణుమూర్తి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వృత్తి కళాకారులను ప్రోత్సహించాలి : రవీందర్

జనగామ, మన చౌరాస్తా : తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బీసీ వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన అమ్మక మహోత్సవాన్ని ఈనెల 25వ తేదీ నుంచి హైదరాబాద్ జిల్లాలోని అంబేద్కర్ విగ్రహం ప్రక్కన ఐమాక్స్ సమీపంలోని ఓపెన్ గ్రౌండ్లో ప్రారంభమైనట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ తెలిపారు. జూన్ 29వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని ఈ ప్రదర్శనలో కుమ్మరి, కమ్మరి, చేనేత, గీత కార్మిక, మేదరి, వడ్రంగి, పూసల తదితర వృత్తులకు చెందిన ఉత్పత్తులు ప్రదర్శించబడి విక్రయించబడుతున్నాయని తెలిపారు. వృత్తి ఆధారిత చేతివృత్తులకు ప్రోత్సాహం కల్పించడం, కళాకారులకు మార్కెట్ లభ్యత చేకూర్చడమే లక్ష్యంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జనగామ జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని బీసీ వృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కోరారు.

యువత మత్తు వీడాలి

- **డ్రగ్స్ రహిత సమాజానికి యువత ఉద్యమించాలి**
- **జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా**

జనగామ, మన చౌరాస్తా : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, వైద్యశాఖ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జనగామ చౌరాస్తా లో ఏర్పాటు చేసిన ర్యాలీని డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండరి నితిన్ చేతన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు, ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొనగా బస్టాండ్ చౌరస్తా లో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీ నెహ్రూ చౌక్ మీదుగా కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ డ్రగ్స్ ఫ్రీ సమాజం కోసం జాగృతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్ పై మత్తు పదార్థాల పట్ల విరక్తిని కలిగించేలా వీడియోలను ప్రదర్శించి అవగాహన పరిచారు. డ్రగ్స్ వ్యతిరేక సంతకాల ప్రచారం, డ్రగ్స్ కు నో జీవితానికి ఎస్ అనే నినాదం ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... యువత డ్రగ్ రహిత సమాజం కోసం ఉద్యమంలా పోరాడాలని, ప్రతి విద్యార్థి సైనికుడిగా సమరం సాగించాలని పిలుపునిచ్చారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమాచారం అందించుటలో ప్రతి ఒక్కరు సహకారం అవసరమన్నారు. డ్రగ్స్ వినియోగిస్తున్న వారి వివరాలను తెల్ల కాగితంపై రాసి పోస్ట్ బాక్స్ లో వేయాలన్నారు. అలాగే ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ఇస్తామన్నారు. డ్రగ్ అలవాటుగా మారితే సమాజం భ్రష్టు పట్టిపోతుందని, యువత పెడ ధ్రోవన పడుతుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. అందుచేత డ్రగ్స్ వినియోగ ప్రాంతాలైన బస్టాండ్, రైల్వే స్టేషన్స్ వంటి ప్రాంతాల్లో యువత నిఘా పెంచి అరికట్టేందుకు సహకరించాలన్నారు. అదేవిధంగా ట్రాఫికింగ్ దినోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నామని పిల్లలు, మహిళలు అక్రమ రవాణా కాకుండా అనుమానితుల వివరాలు తెలియజేస్తూ నిరంతరం అప్రమత్తతో ఉండాలన్నారు.

డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణలో పోలీసు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు, పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్ పై అవగాహన పొందాలని తద్వారా డ్రగ్ రహిత సమాజాన్ని చూడగలుగుతామన్నారు. విద్యార్థుల అవగాహన కోసం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కేజీబీవీ విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తదనంతరం గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. మత్తు పదార్థాలను దరిచేరనీయమని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజయ్య, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ దివ్యాంగులు వయోవృద్ధుల శాఖ అధికారిని ఫ్లోరెన్స్, జిల్లా వైద్య శాఖ అధికారి మల్లికార్జునరావు, పోలీస్ శాఖ అధికారులు, సైకాలజిస్టులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంట పనులు స్పీడప్ చేయాలి

- నిత్యం రివ్యూ, పర్యవేక్షణ చేస్తున్న కలెక్టర్
- పంచతంత్ర థీమ్‌తో పార్క్

జనగామ, మన చౌరాస్తా : పట్టణానికి బతుకమ్మ కుంట స్పెషల్ అట్రాక్షన్‌గా కనపడేలా అభివృద్ధి పనులు జరగాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం, పట్టణంలో గల బతుకమ్మ కుంటను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రూ. కోటి 50 లక్షలతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు బతుకమ్మ కుంటను పంచతంత్ర థీమ్ తో అభివృద్ధి చేయాలని, సుందరీకరణ నేపథ్యంలో గ్రిల్స్, గజిబోలు, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆట స్థలం, ఆడుకునేందుకు పరికరాలు, చిన్న పార్కు ఏర్పాటుకు ప్రారంభించిన పనులను వేగవంతం చేసి, నెల రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు చెరువు పూడికతీత పనులు, వాకింగ్ ఏరియా, లైటింగ్, ఫెన్సింగ్, ఒక వాటర్ ట్యాంక్ పనులు అయిపోయాయని మిగతా పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ రాజ్‌కుమార్, ఏఈ మహిపాల్ పాల్గొన్నారు.

కుల అసమానతలపై పోరాడాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

జనగామ, మన చౌరాస్తా : పేదల ఐక్యతకు ఆటంకంగా నిలిచి కుల అసమానతలపై పోరాడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. గురువారం కేవీపీఎస్ జనగామ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు లింగాలఘణపురం మండలం వనపర్తిలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ఘనంగా ప్రారంభ మైనాయిట్ క్లాసుల ప్రారంభ సూచకంగా కేవీపీఎస్ జెండాను కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలబ్ బాబు క్లాసు బోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుధర్మ శాస్త్రాల పేరుతో మానసిక చట్టాలు చేసి దేశాన్ని ఆధ్యాత్మిక దోపిడీ చేశారని విమర్శించారు. పెట్టుబడిదారులు భూస్వాములు కలిసి కులవ్యవస్థను పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. పేదలు దోపిడికి వ్యతిరేకంగా పోరాడకుండా విచ్ఛిన్నం చేస్తున్నారన్నారు. నిచ్చెన మెట్ల వ్యవస్థ ద్వారా కింది కులాలను పైకులాలను అత్యంత హీనమైన స్థితిలో చూస్తున్నారని, కుల వ్యవస్థ వలన సమాజ అభివృద్ధికి ఆటంకంగా మారిందని అన్నారు. మనుషులను మనుషులుగా చూసి పరిస్థితులు లేవని తెలియజేశారు. దళితులు సామాజిక ఆర్థిక సమానత్వం కోసం అంటరానితనం పోవాలని ఆత్మగౌరవంగా జీవించాలని, కుల నిర్మూలన ప్రధాన లక్ష్యంతో సంఘం ఏర్పడిందని అన్నారు. దళితులు ఎదుర్కొంటున్న 56 రకాల వృక్ష రూపాలను గుర్తించి వాటిపై అనేక సామాజిక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించామని తెలిపారు. దళితులపై

జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు వివక్ష రూపాలను అరికట్టడానికి ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఉండాలని పోరాటాల నిర్వహించి ప్రభుత్వంతో ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయించింది కెవిపిఎస్ అని అన్నారు. ఇటీవల కాలంలో దళితుల మైనారిటీల అభ్యుదయ శక్తులపై దాడులు దౌర్జన్యాలు హత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. దళితులకు సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేశారని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నిర్వీర్యం చేశారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్క లబ్ధిదారునికి కూడా రుణం ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. నిరుద్యోగ యువకులకు సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లులేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణా తరగ తులకు ప్రిన్సిపాల్ గా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం వ్యవహరించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు ఉప్పలయ్య, పల్లేర్ల లలిత, జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం యాదగిరి, పట్టణ కార్యదర్శి బోట్ల శ్రవణ్, మండల కార్యదర్శి గందమల మనోహర్, మహిళ కో కన్వీనర్ ఎండీ హతియ సుల్తన, నాయకులు గోగుల లక్ష్మి, లక్క మంజుల, మెడ శోభ, కనుగంటి విజయ, మబ్బు భాగ్య, తెప్పరపు లావణ్య, శిరిగిరి కృష్ణయ్య, ఏళ్ల క్రాంతి, కాకర్ల పద్మ, కొమ్ము శిరీష, పికిలి భాగ్య, చింత యాదగిరి, నగిల్ల పెంటయ్య, శిరిగిరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యార్థులకు మెరుగైన బోధన

నర్మెట, మన చౌరాస్తా : విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేసేందుకు ఏఐ పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పుడే అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయని మండల విద్యాశాఖ అధికారి మడిపెల్లి ఐలయ్య అన్నారు. గురువారం నర్మెట మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథయక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్, ఏఎక్స్ఎల్ (ఎఐ) ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువస్తుందని అన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని నిర్ణయించి ల్యాబ్ లను ప్రారంభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం వల్ల 3, 4, 5 తరగతుల విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నీలం వేణు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లూరు లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ పవన్ కుమార్, ఏ.శౌరి, పి.రాజసులోచన తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా రాధాకృష్ణ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పింకేష్ కుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు.

'అనుమతిలేని కాలేజీపై చర్యలు తీసుకోవాలి'

జనగామ, మన చౌరాస్తా : అనుమతు లేకుండా నిర్వహిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని టీజీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న నవిజ్ఞ ఒకేషనల్ జూనియర్ కాలేజ్, ప్రజ్ఞ జూనియర్ కాలేజ్ కళాశాలలపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు వారి వార్షిక విద్యా సంవత్సరాన్ని కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్, కేయూ జేఏసీ ఆసర్ల సుభాష్, సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

రైతు పక్షపాతి కాంగ్రెస్ : మహేష్

హనుకొండ, మన చౌరాస్తా : రైతు పక్షపాతి కాంగ్రెస్ అని, తమ ప్రభుత్వం రైతు సంక్షేమం ధ్యేయంగా కృషి చేస్తుందని మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ అన్నారు. అయన ఎన్టీఆర్ నగర్‌లో మీడియాతో మాట్లాడారు రాష్ట్ర ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉన్న తెలంగాణ ప్రభుత్వంలో తొమ్మిది రోజుల్లో 70 లక్షలు రైతుల ఖాతాల్లో 9వేల కోట్ల జమ చేసి రైతులకు పంట పెట్టుబడి సహాయం ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం తమ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తికి ఎన్టీఆర్ అవార్డు

హనుకొండ, మన చౌరాస్తా : సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రచయిత గడ్డం కేశవమూర్తికి మరో అత్యున్నత పురస్కారం లభించింది. విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, సంచలన రాజకీయవేత్త, మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ ఎన్టీ రామారావు స్మారక అవార్డును ఆయన పొందారు. విజయవాడకు చెందిన ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తో పాటు గడ్డం కేశవమూర్తికి ఈ అవార్డును ప్రదానం చేసింది. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క చేతుల మీదుగా కేశవమూర్తి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రి శాలువాతో సత్కరించి మెమెంటో తో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గత మూడున్నర దశాబ్దాలుగా వివిధ దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తున్న కేశవ మూర్తి ఇప్పటి వరకు అరడజన్ పుస్తకాలను స్వయంగా రచించి ప్రచురించారు. అలాగే 100 మంది ఐపీఎస్, ఐపీఎస్ అధికారుల సక్సెస్ స్టోరీలను రాసి జనసారథులు పేరిట పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ లలో కూడా ప్రధాన భూమిక పోషించారు. మూడేళ్లపాటు వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించారు. తెలంగాణ ప్రభుత్వ విశిష్ట పురస్కారంతోపాటు జాతీయ స్థాయిలో అనేక అవార్డులను కేశవమూర్తి పొందారు. పేదల పెన్నిధి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అవార్డు ప్రదానంతో జర్నలిస్టు రంగానికి కేశవమూర్తి మరింత గౌరవం తీసుకువచ్చారని పలువురు సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, పాత్రికేయులు వ్యాఖ్యానించారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ కేశవమూర్తికి ఈ అవార్డు లభించడం పట్ల వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, రాజకీయ వేత్తలు, అధికారులతోపాటు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కార్పొరేట్ల చేతుల్లో మోడీ స్టీరింగ్

- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొసాగుతోంది
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్

జనగామ, మన చౌరాస్తా : పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయని, మోడీ స్టీరింగ్ కార్పొరేట్ల చేతుల్లో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. 'ఎమర్జెన్సీ నాడు.. నేడు' అనే అంశంపై సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన సదస్సు జనగామ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇందిరాగాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా 'నాడు ప్రకటిత ఎమర్జెన్సీ నేడు అప్రకటిత ఎమర్జెన్సీ..' అనే కార్యక్రమం నిర్వహించామన్నారు. రాజ్యాంగం, అందులోని సూత్రాలను విస్మరించి నాడు ఎమర్జెన్సీని

ఆనాటి రాష్ట్రపతి బాధ్యతగా వ్యవహరించలేదన్నారు. కనీసం కేంద్ర క్యాబినెట్‌ను కూడా సమావేశ పరచకుండా ఆగమేఘాల మీద ఈ చర్య తీసుకోవటం సమర్థనీయం కాదన్నారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాల వల్ల ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పునిచ్చారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు, సీజేఐ, పార్లమెంట్, పీఎం అందరికన్నా రాజ్యాంగమే గొప్పదని తెలిపారు. దాన్ని బుల్డోజ్ చేస్తే ప్రజలే రాజ్యాంగాన్ని రక్షించుకుంటారనే విషయాన్ని ఆనాటి ఘటనలు చెబుతున్నాయని వివరించారు. ప్రశ్న అనేది అభివృద్ధికి మూలమన్నారు. నాలుగొందల సీట్లు వస్తాయని కలలుగన్న వారికి ప్రశ్నించే శక్తులు పెరగటంతో అనుకున్న సీట్లు రాలేదని గుర్తు చేశారు. అసమ్మతి, విమర్శించటం, విచక్షణ, వ్యతిరేకించటం అత్యంత సహజమైనవిగా ఉండాలన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా వెన్నుముకతో నిలబడాలని సూచించారు. అప్పుడైనా.. ఇప్పుడైనా ప్రభుత్వాన్ని నడుపుతున్నది ప్రధానులు కాదనీ, వారు కేవలం డ్రైవర్లు మాత్రమేనని చెప్పారు. పరిపాలనకు డైరెక్షన్ చేసేది కార్పొరేట్లేనని అన్నారు. కారు డ్రైవర్‌గా మోడీ ఉంటే.. వెనుక సీట్లో కూర్చోని 'లెఫ్ట్, రైట్, స్ట్రెట్' అంటూ చెప్పేది పెట్టుబడిదారులేనని విమర్శించారు. 1960లో కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి పెద్ద దెబ్బ

తగిలిందన్నారు. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల కూటములు విజయాలు సాధించాయని చెప్పారు.

1970 నాటికి తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయనీ, నిత్యావసర వస్తువుల ధరల విపరీతంగా పెరుగటం, నిరుద్యోగం ఇత్యాది సమస్యలు పెరిగిన నేపథ్యంలో వాటన్నింటినీ పక్కతోవ పట్టిస్తూ, అధికారాన్ని కాపాడుకోవడం కోసం అనాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించిందని వివరించారు. ఇప్పుడు కూడా ఆనాటి ఎమర్జెన్సీలాంటి పరిస్థితులే వచ్చాయన్నారు. పెట్టుబడికి నష్టం వస్తే, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని చెప్పారు. పెట్టుబడి ప్రయోజనాలు ముందుకు పోవాలంటే హక్కులు, చట్టాలు పోరాటాలు, సమ్మెలు ఆటంకంగా ఉండకూడదనే ఉద్దేశంతోనే నాలుగు లేబర్ కోడ్‌లు, ఇతర సవరణలు తీసుకొస్తున్నారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో ఎన్నో దారుణాలు జరిగాయన్నారు. రాజకీయ ప్రత్యర్థులను జైల్లో పెట్టారని, పత్రికలపై సెన్సార్ విధించారని, పాత్రికేయులు, కార్యకర్తలు జైళ్ల పాలయ్యారని చెప్పారు. నాటి ప్రభుత్వం ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాల గొంతు నొక్కేందుకు పూనుకుందన్నారు. నేటి మోడీ పాలన కూడా ఎమర్జెన్సీ కాలాన్ని మరిపిస్తోందని విమర్శించారు. నాడు మీసా ఉంటే.. నేడు ఉపా చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. రాజ్యాంగ బద్ధ సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి అని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ సర్కార్ 17 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇతర మతస్తులను పెండ్లి చేసుకోవటాన్ని తప్పు పడుతూ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. అప్రకటిత ఎమర్జన్సీని కొనసాగిస్తున్న మోడీకి ఎమర్జన్సీ వ్యతిరేక దినంగా పాటించే నైతిక హక్కులేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల అహల్య, సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజేందర్, పుతుకునూరి ఉపేందర్, బిట్ల గణేష్, ఎండి అజారుద్దీన్, శ్రీనివాస్, నాయకులు బాల్నే వెంకట మల్లయ్య, పందిళ్ళ కళ్యాణి, బండ సౌందర్య, భవాని, పాము శ్రీకాంత్, అన్నయబోయిన రాజు, ధర్మ బిక్షం, గాడి శివ ధరావత్, మహేందర్ వెంకటేష్, లింగాల సుగుణ, సురేష్ నాయక్, కళ్యాణ్, తిప్పారపు తులసి, బాలస్వామి, పాష తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత : ఈవో

పాలకుర్తి, మన చౌరాస్తా : మొక్కలను పెంచడంతో పాటు వారిని సంరక్షించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు అన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదా శాఖ కమిషనర్ ఆదేశాలతో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈవో, అర్చకులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవో మోహన్ బాబు మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షిస్తే మానవ మనుగడకు ఎంతో దోహదపడుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతగా భావించి విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విప్

ఆత్మకూరు, మన చౌరాస్తా : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలం లోని తుక్కాపురం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు, కూరేళ్ళ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు, పుల్లాయిగూడెం గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి కప్రాయిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు, వాటర్ ఫిల్టర్ ప్రారంభించారు. రాఘవాపురం గ్రామంలో సీసీ రోడ్డుకు, దుప్పల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు, నర్సాపురం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు, లింగరాజుపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు. దుప్పలి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ క్లాస్ రూమ్ పరిశీలించారు. ప్రహరీ నిర్మాణంతో పాటు, విద్యార్థులు కోరిన మేరకు నూతన వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.